
## కథ

## మావారి ఆర్థిక విధానం ఇప్పటికీ అర్థం కాదు!

**పదిహేను సంవత్సరాల నుండి అబ్జర్వు చేసిన తరువాత ఆయన అర్థశాస్త్రం మీద అదీ నాకు తోచిన అమూల్యాభిప్రాయం!**

**ఆయనతో వాదించి టైము, ఎనర్జీ వేస్టు చేసుకోదలచుకోలేదు.**

**నా అభిప్రాయాలు, ఆలోచనలు నాలో నేనే దాచుకుంటూ ఉంటాను. ఆలోచించడం మాత్రం మానను.**



# ఆర్థిక సూత్రం

అందుకే ఆయనతో ప్రయాణం అంటే ఒకవిధంగా ఆసక్తిగాను మరోవిధంగా తమాషాగానూ ఉంటాయి.

దాదాపు అయిదు సంవత్సరాల నుండి తిరుపతి వెళదాం అనుకున్నది సరిగ్గా ఈ వేసవికాలం కుదిరింది.

ఏ కళనున్నారో ప్రయాణానికి కావల్సిన ఏర్పాట్లన్నీ చేశారు. నర్సాపూర్ టు సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో పాలకొల్లులో రిజర్వేషన్ దొరికింది.

మావారి ఆర్థికశాస్త్రం అమలుజరగడం ప్రారంభం అయ్యింది.

ఇంటిదగ్గర నుండి బస్టాండ్‌కి ఒక రిక్షానా? రెండు రిక్షాలా? అన్న మీమాంస మొదలయింది.

మేమిద్దరం, ముగ్గురు పిల్లలు, రెండు సూటుకేసులు, ఒక బ్యాగ్. అదీ మా లగేజ్.

రిక్షాతో ప్రారంభం అయ్యింది ఆయన ఆర్థిక విధానం. కాసేపు ఆలోచించి, ఒక్క రిక్షాలో నేను, ఇద్దరు ఆడపిల్లలు, లగేజ్‌తో బస్టాండ్‌కు బయలుదేరాం.

వెనుక ఆయన, పిల్లాడు నడచి బస్టాండ్ చేరారు.

బస్సెక్కి పాలకొల్లు చేరాం. సాయంత్రం నాలుగయింది. వేసవికాలం ఎండ ఇంకా తగ్గుముఖం పట్టలేదు. ఆరుంబావుకు పాలకొల్లు స్టేషన్‌లో ఆగుతుంది ఎక్స్‌ప్రెస్.

బస్ దిగగానే బస్టాండులో నన్ను, ఆయన్ను, ముగ్గురు పిల్లలను, లగేజ్‌ని చూడగానే రిక్షావాళ్లు ముగ్గురు మాదగ్గరకు వచ్చారు.

అందర్నీ 'వద్దు, వద్దు' అంటూ తరిమేశారు ఆయన. ఉక్కబోతగా ఉంది. నాకు చిరాగ్గా ఉంది. పిల్లలు అనీజీగా ఉన్నారు. ఒక రిక్షావాణ్ని పిలిచి బేరం ఆడడం మొదలుపెట్టారు. తీరుబడిగా రైల్వేస్టేషన్‌కు రెండు రిక్షాలయితే, ఒక్కొక్క రిక్షా కిరాయి ఎంత? ఒకే రిక్షావాడు మొత్తం అందర్నీ తీసుకెడితే ఎంత? ఇదీ ఆయన సమస్య, సర్దుబాటు.

ఆ రిక్షావాడు మరో రిక్షావాడి దగ్గరకు వెళ్లి సంప్రదించి మా ఆయన దగ్గరకు వచ్చాడు.

ఒక్కొక్క రిక్షా ఎనిమిది రూపాయలు అనీ, రెండు రిక్షాలయితే పదహారు రూపాయలని కచ్చితంగా చెప్పాడు.

**తేజరా**

సుదీర్ఘ చర్చల అనంతరం ఒక్క రిక్షా అయితే పన్నెండు రూపాయలు అని ఒకడు ధైర్యంగా ముందుకు వచ్చాడు.

నేనేమీ మాట్లాడటం లేదు. ఆయన నన్నూ ఏమీ అడగడంలేదు. చూస్తున్నాను. వింటున్నాను.

రేట్లు తగ్గిస్తే యూనియన్ వాళ్లు ఒప్పుకోరని, కాబట్టి వాళ్లు చెప్పిన కిరాయికే ఒప్పుకొని తీరాలని హక్కులు- బాధ్యతలు అంటూ ఆయన్ను నిలదీసి ఒక్కొక్క రిక్షాకు ఏడు రూపాయలయితే వస్తామని ఒప్పందానికి వచ్చారు.

కానీ మావారు ఒప్పుకోలేదు. రిక్షా వాళ్లందరూ వేరే కిరాయి చూసుకోడానికి వెళ్లిపోయారు. ఒక్క క్షణం మా ఆయన ఏకాకి అయినట్లు అనిపించింది. ఇంతలో ఒక రిక్షావాడు వచ్చి "బాబూ! నేను పదకొండు రూపాయలకొత్తాను. కాతంత ఎత్తులో దిగాలి మరి. తోయాలి వెనకాల" అన్నాడు మావైపు చూస్తూ.

ఈ రిక్షావాడిని కూడా పోగొట్టుకుంటే వేరే మార్గం లేదనిపించి, ఒక్కక్షణం ఆలోచించి ఒప్పుకున్నారు.

నేను, ఆయన రిక్షా ఎక్కిన తరువాత రెండు సూటుకేసులు పెట్టారు మా కాళ్ల దగ్గర. వాటి మీద ఇద్దరు ఆడపిల్లలు కూర్చున్నారు. నా ఒళ్లో కుర్రాడు కూర్చున్నాడు. ఆయన ఒళ్లో బేగ్ ఉంది. కదిలింది మా చైతన్య రథం మావారి ఆర్థిక విధానానికి అనుగుణంగా.

అందరం కదలలేని పరిస్థితి. ఇది ఒక పరీక్ష. ఓపికకు పరీక్ష. పిల్లలు మూలుగులు, విసుగులు, నిట్టూర్పులు అన్నీ ఆయన చిరునవ్వుతో రిలాక్సయ్యారు.

రిక్షావాడు చాలా బలవంతంగా తొక్కుతున్నాడు.

తొక్కి తొక్కి బ్రిడ్జి దగ్గరకు రావడంతో దిగి హేండిల్ బార్ పట్టుకుని లాగడం మొదలుపెట్టాడు. లాగలేకపోతున్నాడు.

చివరకు వాడి అవస్థ చూసి ఆయన దిగారు. రిక్షావాడు కొద్దిగా లాగగలిగాడు. నా ఒళ్లో మావాడు కూడా దిగాడు. మరింత సులువుగా రిక్షావాడు లాగగలిగాడు.

నాకు మాత్రం ఈ అవస్థ చూసి ఇక తిరుపతి ప్రయాణం అంతా ఇలాగే ఉంటుందా అన్న నిరాశ వచ్చింది.

ప్రయాణానికి, సుఖానికి- డబ్బుకి లింకు పెట్టి ఈ మాదిరి టూర్లు అనవసరమనిపించింది.

"కానీ, మధ్యతరగతి వాళ్లు ప్రతీ అడుగు ముఖ్యంగా ఆర్థిక సంబంధమైన వ్యవహారం ఆచి తూచి వెయ్యాల్సిందే!" అంటారు ఆయన.

ప్రతీ విషయం ఆర్థిక విధానంతో ముడిపెడితే ఇక సుఖమేమిటి అనేదే నా వాదన.

బ్రిడ్జి దాటి మామూలు రోడ్డుమీదకు వచ్చాక మళ్లీ ఆయన, పిల్లాడు రిక్షా ఎక్కేశారు.

రిక్షావాడు తొక్కుతున్నాడు.

వాడి ఒళ్లంతా చెమట అలా జలపాతంలా కారుతోంది.

కాస్త వయస్సులోనే ఉన్నాడేమో పిక్కల దగ్గర కండలు అలా స్పష్టంగా కదులుతున్నాయి. భుజాలు బిగువుగా కసరత్తు చేస్తున్నట్టు మెదులుతున్నాయి.

అది వాడు ఒక ఎక్సర్‌సైజులా చేస్తున్నట్లు ఉన్నా దాని అండర్ కరెంటు మాత్రం జీవన సమస్య. క్షుద్బాధ. జీవన విధానం. ఆర్థిక సమస్య.

ఒక్కసారి తొక్కేటప్పటికి తల బాగా వంచి మళ్లీ ఊపిరి పీల్చుకుని బిగపట్టి తలపైకి లేపి చేతులు రెండూ హేండిల్‌ని గట్టిగా పట్టుకుని వంటి బిగిని తొక్కుతున్నాడు.

నేనే కాదు మావారు కూడా వాడిని పరీక్షగా చూస్తున్నారు.

మనిషిని మనిషి లాగటం, మోయడం. ఏమిటీ శ్రమ దోపిడి? ఒక మనిషిని తన శక్తికి మించి కష్టపెట్టటం ఏవిధమైన నేరం కిందకు వస్తుంది?

మనసుంటే, ఆలోచన ఉంటే ఆ దోపిడీ చేసేవాళ్లకు అర్థం కాదా?

ఎందుకో మావారు మౌనంగా ఉన్నారు!

మొత్తానికి నా ఆలోచనలు పరిపరివిధాలా పోయాయి.

చివరకు స్టేషన్‌కు చేరాం.

రిక్షావాడికేసి చూశాను. ముఖానికి పట్టిన చమటలు తుడుచుకొని సామాను స్టేషన్‌లో పెట్టాడు.

అందరూ లోపలికి వెళ్లాక వాడు మావారి కోసం చూశాడు.

ఆయన డబ్బులిస్తుంటే ఎందుకో వాడి ముఖంలో నవ్వు, తృప్తి కనిపించాయి.

నేను వాడు తీసుకున్న డబ్బుకేసి చూశాను. ఒక పది రూపాయల నోటు, ఒక అయిదు రూపాయల నోటు. వెంటనే నేను మావారి వైపు చూశాను.

"తీసుకో! చాలా కష్టపడ్డావు" అంటూ స్టేషన్‌లోకి దారి తీశారు.

మావారి మీద నాకు అభిమానం పెరిగింది. శ్రమశక్తిని గుర్తించిన ప్రతిభావంతుడైన ఒక ఆర్థికవేత్తను చూడగలిగాను ఆయనలో.

శ్రమకు ఫలితాన్ని జోడించి దానికి తగ్గ సూత్రం కనిపెట్టేటట్టు చేసిన ఆర్థికశాస్త్రం మీద అభిమానం వచ్చింది. మావారు ముందుగా మరి కొంచెం ఆలోచించి ఉంటే, రెండు రిక్షాలలోనూ, చుట్టూ పరిసరాలను గమనిస్తూ, మనుషులను గమనిస్తూ హాయిగా వచ్చేవాళ్లమనిపించింది.

శ్రమకు తగ్గ ప్రతిఫలం, ఉత్సాహానికి తగ్గ ఆనందం ఉంటే ఏ విధానమైనా ఏ సూత్రమైనా కలకాలం నిలుస్తుంది.

స్టేషన్ లోపల సిమ్మెంటు బెంచి మీద కూర్చుని అందరం రిలాక్స్ అయ్యాం.

బహుశా మా తిరుపతి యాత్రంతా ఈ రిక్షాసూత్రంతో ముందు ఆలోచనగా పెట్టుకుని సుఖంగా, హాయిగా, దర్జాగా, ఆనందంగా ఉంటుందని నమ్మకం కుదిరింది.

*

## ప్రకాశిస్తుందా?

**'మజా', 'గజిని' చిత్రాల్లో నటించి మంచి ఇమేజ్‌ని సొంతం చేసుకున్న అసిన్ ఇప్పుడు స్ట్రయిట్ చిత్రాలతో పాటూ డబ్బింగ్ చిత్రాల్లో కూడి నటించి మెప్పించగలనని నిరూపించింది. బడ్జెట్ తక్కువైనా మంచి కథ, డిఫరెంట్ యాక్షన్ ఉండే చిత్రాలకి తను సై అంటోంది. అన్నట్టు ఆమె అందానికి కూడా మెరుగులు దిద్దుకుంది. కొత్తదనం ఎక్కడున్నా ప్రేక్షకులు ఆదరిస్తారని ప్రగాఢంగా నమ్మే ఈభామ ఇప్పుడు డీగ్లామరైజ్ ఉన్న పాత్రలైనా తనకు మంచి పేరు తెస్తాయంటోంది.**

